TS-27-0016491

ప్రజా పక్షం.. ప్రజా గొంతు..

జయ జయహే

# సూర్యోదయం

హైదరాబాద్ | సంపుటి -2 | సంచిక -145 | పేజీలు : 8 | ఎడిటర్ : శివకృష్ణ | బుధవారం 9 సెప్టెంబర్ 2026 | వెల : 4/-

**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న సూర్యోదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 9515342857

## స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

- శాసనసభ నిబంధనలను ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా
- ఏజీని ప్రశ్నించిన హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలపై పిటిషన్ వేసిన ప్రభుత్వం
- వాదనలు వినిపించిన ఏజీ
- ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారన్న ఏజీ

హైదరాబాద్

అసెంబ్లీ బయట జరిగిన పరిణామాలపై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలంటూ డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్ - మిగతా3లో

## నా వడోదరా అద్భుతం

- ప్రధాని మోదీ భావోద్వేగం
- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- అలకపాన్పు ఎక్కిన మేనమామకు ఇప్పుడు పని దొరికింది
- విపక్షాలపై మోదీ సెటైర్లు
- వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా ప్రాజెక్టులకు శ్రీకారం
- 2,800 కి.మీ. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి
- 250కుపైగా ట్రక్కుల సరుకును ఒకే రైలులో తరలించిన ఘనత
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

# రెండోరోజూ అదే వే'ఢీ'

- ఢీ అంటే ఢీ అన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్
- అటు అసెంబ్లీలో, ఇటు బయట పోటాపోటీ వ్యూహాలు
- రాజకీయ ఆధిపత్యం కోసం రెండు పార్టీల ప్రయత్నాలు
- రాష్ట్ర మంత్రులు, అసెంబ్లీ కార్యదర్శితో పలుమార్లు భేటీ అయిన ముఖ్యమంత్రి
- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యల విషయంలో మంత్రాంగం.. సస్పెన్షన్ తీర్మానంపై చర్చ
- అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్

అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ఢీ అంటే ఢీ రెండోరోజూ కొనసాగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటిరోజు సోమవారం బీఆర్ఎస్ నేతలు నల్ల టీ షర్టులు ధరించి రావడం, వారు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, 'అనుచిత వ్యాఖ్యల వ్యవహారంతో'పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కాగా మంగళవారం కూడా అదే వాతావరణంలో ఉభయ సభలు జరిగాయి. ఈ అంశంపై రాజకీయ ఆధిపత్యం సాధించేందుకు రెండు పార్టీలు పోటీలు పడి వ్యూహాలు రచించాయి. ఇక అసెంబ్లీ బయట కూడా ఇదే తీరు కొనసాగించాయి. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం - మిగతా3లో

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..

- లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21
- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్

## బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ

- ద్వైపాక్షిక వాణిజ్యం, రక్షణ, ఆర్థిక సహకారంపై చర్చ!
- సెప్టెంబర్ 11న భేటీ కానున్న మోదీ, పుతిన్
- అజెండాలో ఎస్‌యూ-57 విమానాల డీల్
- వెల్లడించిన క్రెమ్లిన్ అధికార ప్రతినిధి

## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

- రైల్వే మంత్రి కీలక ప్రకటన
- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

## అరాచకాలను అరికట్టేందుకు అమిత్ షా శాఖ ఏం చేస్తోంది?

- దిల్లీలో మణిపురి సంగీతకారుడి కొట్టిచంపిన ఘటనపై రాహుల్‌గాంధీ స్పందన
- ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు దిల్లీలో భద్రత ఉందా అంటూ ప్రశ్న
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, దిల్లీ పోలీసుల తీరుపై విమర్శలు



## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి

# సస్పెండ్

- ప్రకటించిన మండలి ఛైర్మన్
- శాసన మండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్
- సెషన్ మొత్తానికి సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన ఛైర్మన్

హైదరాబాద్

శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి- మిగతా3లో

## ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ

- ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు
- నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటు
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు

హైదరాబాద్

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. - మిగతా3లో

## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

సెప్టెంబర్‌లో దక్షిణ ద్వీపకల్పంలో వర్షాల పరిస్థితి బలహీనంగానే ఉండే అవకాశం

ఏపీలో 45 శాతం, కేరళలో 24 శాతం వర్షపాతం లోటు

తెలంగాణలో 8 నుంచి 10 వరకు అక్కడక్కడా వర్షాలు

ప్రజా పక్షం.. ప్రజా గొంతు..
జయ జయహే
సూర్యోదయం
https://suryodhayam.com/
https://epaper.suryodhayam.com/
MANA SHOW
బుధవారం
9 సెప్టెంబర్
2026

# హైదరాబాద్‌లో ఘనంగా కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం

**మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మ శ్రీ టిడిపి నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక, తాంత్రిక పూజా విధానాలపై శిక్షణ**

**మంత్రోపదేశ మహోత్సవంతో ముగిసిన కార్యక్రమం**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 08 (సూర్యోదయం):**

కేరళ సంప్రదాయ తాంత్రిక విధానంలో అయ్యప్ప స్వామి పూజా విధానాలను పరిచయం చేయడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక సాధన, పూజా ప్రక్రియలపై ప్రాయోగిక అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు, సాధకులు, పూజా విధానాలను అభ్యసిస్తున్న వారు హాజరయ్యారు. గుండ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్ వేదికగా కె. నిరంజన్ రావు గురూజీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సమ్మేళనాన్ని కేరళలోని చెంగన్నూర్‌కు చెందిన మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మ శ్రీ టిడిపి నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

**తొలిరోజు ప్రాయోగిక శిక్షణ, అయ్యప్ప సాధన...**

సెప్టెంబర్ 6వ తేదీన మొదటి రోజు కార్యక్రమాల్లో పాల్గొన్న సాధకులకు కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. గురు ఆగమనంతో పాటు గురు వందనం, వివిధ పూజా ప్రక్రియలకు సంబంధించిన ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు విడతలుగా ప్రాయోగిక శిక్షణ కొనసాగింది. మధ్యాహ్నం అనంతరం కూడా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి, అనంతరం అష్టాదశ కలశ పూజ, అయ్యప్ప పడి పూజను కేరళ తాంత్రిక సంప్రదాయ పద్ధతిలో

ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప భజన సంధ్య కార్యక్రమం భక్తి వాతావరణాన్ని నెలకొల్పింది. భజనలు, ఆధ్యాత్మిక సంగీతంతో పాటు పాల్గొన్న భక్తులు, అతిథులను సత్కరించే కార్యక్రమం నిర్వహించారు.

**రెండో రోజు మంత్రోపదేశ మహోత్సవం...**

సెప్టెంబర్ 7వ తేదీన రెండో రోజు కార్యక్రమానికి అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఉదయం అల్పాహారం అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తంత్ర గురు బ్రహ్మశ్రీ టీ.డి.పీ. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో అయ్యప్ప మంత్రోపదేశ కార్యక్రమం నిర్వహించారు. మంత్రోపదేశం అనంతరం గురు పాద పూజ, సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సాధకులు, ఇతర ప్రముఖులకు జ్ఞాపికలను అందజేశారు.

**గురూజీతో ప్రత్యేక ముఖాముఖి...**

రెండో రోజు సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వారికి గురూజీతో వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం కల్పించారు. ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన సందేహాలు, పూజా విధానాలపై ప్రశ్నలు, ప్రత్యేక సందర్భాల్లో పూజా మార్గదర్శకత్వం, అయ్యప్ప పడి పూజకు సంబంధించిన అంశాలపై మార్గదర్శనం పొందే అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

**కేరళ తాంత్రిక సంప్రదాయానికి ప్రత్యేక ప్రాధాన్యం...**

అయ్యప్ప పూజా విధానాలను కేరళ తాంత్రిక సంప్రదాయంలో అధ్యయనం చేయాలనుకునే సాధకులకు ఇలాంటి కార్యక్రమాలు ప్రాయోగిక అవగాహన కల్పించే వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో కేవలం ఉపన్యాసాలకు పరిమితం కాకుండా "నేర్చుకోవడం – సాధన చేయడం – అనుభవించడం – గురు ఆశీస్సులు పొందడం" అనే విధానంలో కార్యక్రమాలను రూపొందించడం ప్రత్యేకతగా నిలిచింది. పూజా విధానాలను ప్రత్యక్షంగా అభ్యసించేందుకు పలు ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించడంతో సాధకులకు మరింత అవగాహన కలిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ప్రజా సమస్యలపై అధికారుల దృష్టి.. పరిష్కారానికి కమిషనర్ ఆదేశాలు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 08 (సూర్యోదయం):**

చింతల్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డి నగర్ వార్డులో గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో "వన్ డే – వన్ వార్డ్" కార్యక్రమాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.కార్యక్రమంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, చెత్త డంపింగ్, శ్మశానవాటికలు, కబరస్తాన్ల అభివృద్ధి, వీధి దీపాలు, బస్ షెల్టర్లు, కమ్యూనిటీ సదుపాయాలు, ట్రాఫిక్ సమస్యలు, ఆక్రమణలు తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.రంగారెడ్డి నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, చెన్నారెడ్డి నగర్‌లో డ్రైనేజీ మరియు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ఏర్పాటుకు వినతులు అందాయి. నెహ్రూ నగర్‌లో తాగునీటి సమస్య, నందానగర్ మరియు గాంధీనగర్ ప్రాంతాల్లో బోర్‌వెల్‌ల ఏర్పాటు, మరమ్మతుల అవసరాన్ని ప్రజలు వివరించారు.హెచ్ఎంటీ ఓపెన్ స్పేస్‌లో చెత్త డంపింగ్ సమస్యను నివాసితులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నందానగర్, గాంధీనగర్, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో కబరస్తాన్లు, శ్మశానవాటికల్లో నీటి సౌకర్యం, షెడ్లు, బెంచీలు, ట్యాపులు, లైటింగ్, ప్రహరీ గోడల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.రంగారెడ్డి నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు, వీధి దీపాల ఏర్పాటు, గాంధీనగర్‌లో కమ్యూనిటీ హాల్, లైబ్రరీ నిర్మాణం, రంగారెడ్డి నగర్ బస్తీ దవాఖానపై కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.ఐఏఎల్ఏ ప్రాంతంలో లారీ పార్కింగ్ కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు, రంగారెడ్డి నగర్ వార్డులో ఆక్రమణల తొలగింపు, ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అంశాలు చర్చకు వచ్చాయి.ప్రజలు వివరించిన సమస్యలను కమిషనర్ సావధానంగా విని, సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ప్రజలతో నేరుగా మమేకమై స్థానిక సమస్యలను గుర్తించి, పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే "వన్ డే -- వన్ వార్డ్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## జీడిమెట్లలో మహిళ అదృశ్యం -- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**- ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకీ కోసం గాలింపు**

**జీడిమెట్ల, సెప్టెంబర్ 8:(సూర్యోదయం):**

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్ నగర్ లాస్ట్ బస్ స్టాప్ ప్రాంతానికి చెందిన అభిజిత్ ఘోస్ (35) ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆయన భార్య ప్రియాంక ఘోస్ (29) సెప్టెంబర్ 7 రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు.ఇంటి ఖాళీ చేసే విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగిన అనంతరం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెళ్లే సమయంలో ఫిర్యాదుదారుకు చెందిన మొబైల్ ఫోన్ మరియు కెనరా బ్యాంక్ ఏటీఎం కార్డును కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లు మరియు ఇతర తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని ఫిర్యాదుదారు తెలిపారు. గతంలో కూడా ఆమె ఇలాగే ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు.అయితే ఈసారి ఆమె అదృశ్యమవడంలో అంకుష్ రామ్ అనే వ్యక్తి ప్రమేయం ఉండవచ్చని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. అదృశ్యానికి గల కారణాలు, ఫిర్యాదులో పేర్కొన్న అనుమానాలపై విచారణ కొనసాగుతోంది.

## ట్రాన్స్‌జెండర్ నాయకులకు జగద్గిరిగుట్ట పోలీసుల సూచనలు

**- శుభకార్యాల్లో ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సూచన.. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరిక**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 08 (సూర్యోదయం):**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తగిన సూచనలు చేశారు.గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు, కార్యక్రమాల సమయంలో డబ్బుల కోసం పట్టుబట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని పోలీసులు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా శాంతియుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించడం, పోలీసుల సూచనలను ఉల్లంఘించడం లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ నాయకులు పోలీసుల సూచనలను పాటిస్తూ శాంతిభద్రతలకు సహకరించాలని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ సూచించారు.

## జగద్గిరిగుట్టలో దోపిడీ కేసు ఛేదన ముగ్గురు నిందితుల అరెస్ట్

**- మహిళ వద్ద బంగారు ఆభరణాలు, ప్లాటినం ఉంగరం లాక్కెళ్లిన దుండగులు.. 24 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు**

**జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 8:(సూర్యోదయం):**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు వేగంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బాధితుల నుంచి లాక్కెళ్లిన బంగారు ఆభరణాలు, ప్లాటినం ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 6న సాయంత్రం కూకట్‌పల్లి నుంచి జీడిమెట్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను, అందులో ఒక మహిళను, యల్లమ్మబండలోని సిఖ్ బస్తీ -- గురు గోవింద్ సింగ్ కాలనీ సమీపంలో ముగ్గురు వ్యక్తులు అడ్డగించారు. అనంతరం వారిని సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి దాడి చేశారు. మహిళ వద్ద ఉన్న బంగారు చెవిపోగులు, ప్లాటినం ఉంగరాన్ని బలవంతంగా లాక్కొని పరారయ్యారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన నిందితులు:థిలిపిథ్య దీపక్ సింగ్ (45), బౌరి రచన్ సింగ్ (25),బురానీ సుర్జిత్ సింగ్ (25) విచారణలో నిందితులు దోపిడీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 4 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవిపోగులు, ఒక ప్లాటినం ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. చీకటి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను ముందుగా గమనించి, వారిని అడ్డగించి నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి బెదిరించి, దాడి చేసి ఆభరణాలు లాక్కోవడం నిందితుల నేర పద్ధతిగా పోలీసులు గుర్తించారు.నిందితుల్లో ఒకరిపై గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.నిందితులను సోమవారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి (ఐపీఎస్), ఏసీపీ ఎ.సి. బాలగంగి రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎన్. సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేంద్ర రెడ్డి, ఎస్ఐ కె. శ్రీనివాస్ , క్రైమ్ సిబ్బంది విజయవంతంగా ఛేదించారు.

## ప్రతిపక్షం పట్ల కక్షపూరితంగా,ద్వేషపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలకులు

**ఎంపీ వద్దిరాజు** కాంగ్రెస్ పాలకులు ప్రధాన ప్రతిపక్షం పట్ల కక్షపూరితంగా,ద్వేషపూరితంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నిశితంగా విమర్శించారు.ప్రతి చిన్న విషయంలో సర్కార్ అతిగా స్పందిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ అరెస్టులు చేసి వేధింపులకు పాల్పడుతున్నదన్నారు.ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు అరెస్టు అయిన విషయం తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర నారాయణ గూడ పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారిని పరామర్శించి తన సంఘీభావం తెలిపారు.ఎమ్మెల్సీలను కింగ్ కోఠి ఆస్పత్రి,లక్డీకాపూల్ లోని మేజిస్ట్రేట్ నివాసం వద్దకు,అటునుంచి నాంపల్లి న్యాయస్థానానికి తీసుకెళ్లిన సందర్భాల్లో ఎంపీ రవిచంద్ర వారితో పాటు ఉన్నారు.ఈ సందర్భాల్లో ఎంపీ వద్దిరాజును మీడియా ప్రతినిధులు చుట్టుముట్టగా మాట్లాడుతూ ప్రభుత్వ దమననీతిని ఎండగట్టారు.ప్రజలకిచ్చిన 420 హామీలు,6 గ్యారంటీలు,13 డిక్లరేషన్ల అమలును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకుండా "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారని మండిపడ్డారు.అసెంబ్లీ సమావేశాలలో బీఆర్ఎస్ లేవనెత్తే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకునేందుకే రేవంత్ రెడ్డి ఒక పథకం ప్రకారం దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ పాలన కాదని,పోలీస్ రాజ్యం అని,వారిని అడ్డుపెట్టుకుని రేవంత్ రెడ్డి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు.కౌన్సిల్ ఛైర్మన్, అసెంబ్లీ స్పీకర్ అనుమతి తీసుకోకుండానే తెల్లావారుజామునే ఎమ్మెల్సీల ఇళ్లపైకి పోలీసులు వెళ్లి, దొంగలు, దోపిడీదారుల వెంటబడి

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

**గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్ర చర్చ**

**ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం**

**విజయవాడ** విజయవాడ డివి మేనర్ హోటల్ వేదికగా టీడీపీ జిల్లా పార్టీ ఎన్నికల సమావేశం జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. పార్లమెంటరీ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్దా వెంకన్నతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమావేశంలో పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు, కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు.